
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 76 వ భాగం

### అజామీళోపాఖ్యానం – 11 ముగింపు

యమధర్మరాజు, నాకంటే అన్యుడైనవాడూ ఘనమైనవాడొకడున్నాడనీ, వారి దూతలనే మీరు చూసారనీ, సేవకులతో చెప్తూ, ఇంకా వివరణ ఇస్తున్నాడు, వాళ్ళెటువంటివారో.

ఉ. లెక్కకు నెక్కువై కసటులేని మహాద్భుత తేజ మెల్లెడం
బిక్కటిలం జరింతు రతి భీమబలాఢ్యులు విష్ణుదూత లా
చక్కని ధర్మశాంతు లతిసాహసవంతులు దేవపూజితుల్
గ్రిక్కిఱియన్ జగంబునను గేశవసేవక రక్షణార్థమై. [6-174]

ఈ విష్ణుదూతలు కళంకం లేని మహాద్భుత తేజంతో, ప్రపంచం అంతా చరిస్తూ ఉంటారు. వీళ్ళు అతి బలమైనవారూ, ధర్మశాంతులూ, అతి సాహసవంతులు. ఎవరి కోసం ఇలా చరించడం అంటే కేశవ సేవకుల కోసం, వారిని రక్షించడం కోసమూను. ఈ దూతలు నా వల్లా, మీ వల్లా, మిగతా దేవ, అసుర గణాల వల్లా భీతి పొందకుండా ఉండడానికి ఈ కేశవ సేవకులని (భగవంతుణ్ణి నమ్ముకున్నవాళ్ళని) రక్షణ కల్పిస్తూ ఉంటారు.

క. భగవత్ప్రణిహిత ధర్మం
బగపడ దెవ్వారి మతికి ననిమిష గరుడో
రగ సిద్ధ సాధ్య నర సుర
ఖగ తాపస యక్ష దివిజ ఖచరుల కైనన్. [6-176]

ఈ భగవంతుడి ధర్మం అనేది ఎంత సూక్ష్మమైనదంటే, దాన్ని గరుడ, ఉరగ (పాములు) సిద్ధ, సాధ్య, నర, సుర (దేవత), ఖగ (పక్షులు), తాపసలు (మునులు), యక్షులు, దివిజ (దేవలోకంలో ఉండేవారు), ఖచరులు (ఖ – ఆకాశం, చరులు - తిరిగేవారు) ఎవరూ కూడా గుర్తించలేరు. ఇది ఎందుకు చెప్తున్నాడంటే, ఈ యమదూతలు అజామీళుణ్ణి తీసుకొస్తున్నప్పుడు ధర్మం గుర్తించలేదు కదా? అది అతి సూక్ష్మాతి సూక్ష్మం కనక మీ తప్పులేదు అని చెప్పడానికన్నమాట. ఇదే మనం మహాభారతం మొత్తం ఎక్కడ చూసినా గమనించవచ్చు. ప్రతీ క్షణంలో కూడా యుధిష్టిరుడు పడే – నేను చేసేది ధర్మమా కాదా? – అనే యమయాతన. అందుకే ప్రతీ విషయంలో కూడా ధర్మరాజు కృష్ణుణ్ణి అడుగుతూ ఉంటాడు – నేను చేసేది తప్పొ ఒప్పొ అనేది అలా ఉంచు, ధర్మమా కాదా అనేది చెప్పు. ఆఖరికి ద్రోణుడు చావడానికి ముందు, తన సైన్యం ఓడిపోతుందనేది తెలిసి కూడా అదే యాతన. “అశ్వత్థామ హతః”

అని అనమంటే ఆ మాట అనడానికి ధర్మరాజు పడే యాతన కూడా మనం గమనించవచ్చు. చివరకి "కుంజరః అని చేర్చవయ్యా బాబూ, ఇవతల నీ ధర్మం పట్టుకుని కూర్చుంటే మిగతా సైన్యం తుడిచిపెట్టుకుపోతుంది," అని చెప్పినా ఎంతో కష్టంతో ఆ మాట అంటాడు – అదీ కృష్ణుడు చెప్పాడు కనకే కానీ స్వంతంగా తనమటుక్కి, తననోటితో అందామని కాదు. ధర్మం గురించి జీవితాంతం అలా కష్టపడ్డాడు కనకే బొందితో స్వర్గానికి వెళ్ళగలిగేడు కదా?

క. ఎన్నఁడుఁ దెలియఁగ నేరరు
పన్నగపతిశాయి తత్త్వ మేనం
గన్నుల వేల్పును డాపలఁ
జన్నమరిన వేల్పు ముదుక చదువుల వేల్పున్. [6-177]

విష్ణువు గురించి తెలుసుకోవడానికి ఇంద్రుడికి గానీ (వంటినిండా కన్నులు ఉన్నవాడు – మేనలో కన్నుల వేల్పు), శివుడు (డాపలజనమరిన వేల్పు – అర్ధనారీశ్వరుడైనవాడు), బ్రహ్మదేవుడికి గానీ (ముదుక చదువుల వేల్పు) సాధ్యం కాదు.

తే. ఏది జపియింప నమృతమై యెసఁగుచుండు
నేది సద్ధర్మపథ మని యెఱుఁగ దగిన
దదియె సద్భక్తి యోగంబు నావహించు
మూర్తిమంతంబు దా హరికీర్తనంబు. [6-180]

ఇటువంటి శ్రీహరిని మరి తెలుసుకోవడం ఎలా? ఆయన నామం జపించడం ఒకటే మార్గం. ఏది జపిస్తే అమృతతుల్యమవుతుందో, ఏది సద్ధర్మ పదమో, ఏది మూర్తీభవించిన భక్తి యోగమో అదే శ్రీహరి కీర్తనం. ఈ శ్రీహరి కీర్తనం జపించే కొద్దీ అమృతతుల్యమవడం గురించి వాల్మీకి నే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కేవలం రెండే రెండు అక్షరాలు మ–రా అంటూ జపించి మామూలు దారిదోపిడీ దొంగ ముని అవడం మనకి తెల్సినదే కదా?

తే. కంటిరే మీరు సుతులార! కమలనేత్రు
భవ్య మగు నామకీర్తన ఫలము నేఁడు
దవిలి మృత్యువు పాశబంధములవలన
జాణతనమున నూడె నజామిళుండు. [6-181]

ఈ సంగతి మీ మటుకు మీరే చూసారు కదా ఎన్నో పాపాలు చేసిన అజామీళుడు పోయేటపుడు 'నారాయణ' అనడం తోటే మృత్యుపాశాల్లోంచి విడిపోయి నేర్పుతో (జాణతనమున) వైకుంఠానికి జేరాడు.

ఉ. ఏటికి జాలిఁ బొంద? నరులే క్రియఁ గృష్ణుని కీర్తనంబు పా
పాటవులన్ దహింపఁ గల దౌటకు సందియ మేల? యిప్పు డీ
తూఁటరి దోషకారి పెనుదోషి యజామిళుఁ డంతమొందుచుం
బాటిగ విష్ణునామ సుతుఁ బల్కుచుఁ గేవలముక్తి కేగఁడే? [6-182]

నేను చేసిన పాపాలకి విముక్తి లేదే అని మానవులు అసలు విచారించడం దేనికి? పెద్ద దోషి అయిన అజామీళుడు ప్రాణం పోతూండగా ఆయన్ని తల్చుకుని ముక్తి పొందాడు కదా, ఇంకా సందేహం దేనికీ? హరి కీర్తనం చేసి పాపాలని దహింపచేసుకోవచ్చు.

క. ఇంతయును దథ్య మని మది
నింతయుఁ దెలియంగలేరు హీనాత్ములు దు
ర్దాంతతర ఘటిత మాయా
క్రాంతాత్యంతప్రకాశ గౌరవ జడులై. [6-183]

అయితే ఇందులో మరో వింత ఏమిటంటే చవు తథ్యం అని తెలిసీ మాయలో చిక్కుకొని దాన్ని దాటలేక (దుర్దాంతతర), హీనాత్ములు అవుతున్నారు అందరూ.

మం. ఈ విధమునన్ విబుధు లేకతమ చిత్తముల నేకతము లేక హరి నీశున్
న నిల్పి తగు భాగవత యోగిపరిపాకమున నొందుదురు వారిం
దేవలదు దండన గతిం జనదు మాకు గురితింప నఘముల్ దలగు మీదన్
శ్రీవరుని చక్రము విశేషగతి గాచు సురసేవితులు ముక్తి గడు బెద్దల్. [6-184]

మరి నిరంతరం హరిని మనసులో స్మరించే భాగవతులని ఇక్కడికి తీసుకురావద్దు. వాళ్లని దండించడం మనం చేయలేం (దండన గతిం జనదు మాకు). వాళ్లని గుర్తిస్తే పాపాలు పోతాయి. వాళ్లని శ్రీవరుడి చక్రం విశేషంగా కాపాడుతూ ఉంటుంది. ఈ పద్యంలో వాడిన వృత్తం మంగళమహాశ్రీ. సింగయ దీన్ని దేనికివాడాడో గమనిస్తే మనకి తెలిసేది, శ్రీహరి మంగళం, మహత్తు చెప్పడానికి. తెలుగులో పద్యాలు రాసేటపుడు మత్తేభం, చంపకమాల, సీసం వంటివి తీసుకుని రాయొచ్చు, కానీ సందర్భానుసారంగా రాయడానికీ, దానికి సరైన పదాలు ఎన్నుకోవడానికి చాలా పటిమ ఉండాలి. దీన్ని మనం భాగవతంలో అనేకానేక చోట్ల చూడవచ్చు.

ఉ. ఎవ్వరు సిద్ధ సాధ్య ఖచరేశ లసత్పరిగీత గాథలం
దెవ్వరు ముక్తిభోగతల హేమ మనోహర చంద్రశాలలం
దెవ్వరు శంఖచక్ర గురుహేతి గదా రుచిరోగ్రపాణు లా
మవ్వపు రూపవంతు లసమానులు పో ధరలోని వైష్ణవుల్. [6-185]

విష్ణునామం పలికే వారిని తీసుకు రావద్దు అని చెప్పాక మరి అటువంటి వారిని గుర్తించడం ఎలా అనేది ఇప్పుడు చెప్తున్నాడు. ఈ విష్ణుభక్తులు సిద్ధ సాధ్యుల చేత కీర్తించబడుతూ ఉంటారు. వారికి చేతుల్లో శంఖ, చక్ర, గదా, ఖడ్గ (గురుహేతి – పెద్ద ఖడ్గము) రేఖలు ఉంటాయి. ఈ రేఖలు చేతుల్లో ఉంటాయి అంటే వాటిని ఒక గుర్తుగా మన శరీరం మీద వేసుకోవడం కాదు. ఎందుకంటే యమదూతల కూడా వెళ్ళేది మన స్థూల శరీరం కాదు కదా. మనసులో కేశవుణ్ణి ఉంచుకున్నవాళ్లని అని అర్థం చేసుకోవచ్చు. ఆ సూక్ష్మ శరీరం మీద ఆ రేఖలు ఉండాలంటే నిరంతరం మనసులో భగవంతుణ్ణి స్మరిస్తూ ఉన్నవాళ్లన్నమాట.

సీ. ఎకసక్కెమున కైన నిందిరారమణునిఁ;
బలుకంగలేని దుర్భాషితులను
గలలోన నైన శ్రీకాంతుని సత్పాద;
కమలముల్ చూడని కర్మరతుల
నవ్వుచు నైనఁ గృష్ణప్రశంసకుఁ జెవిఁ;
దార్పనేరని దుష్కథా ప్రవణుల
యాత్రోత్సవంబుల నైన నీశుని గుడి;
ద్రోవఁ ద్రొక్కఁగలేని దుష్టదులను [6-188]

ఆ. బరమ భాగవతుల పాదధూళి సమస్త
తీర్థసార మనుచుఁ దెలియలేని
వారి వారివారి వారిఁ జేరినవారిఁ
దొలుతఁ గట్టి తెందు దూతలార! [6-188.1]

ఈ విష్ణునామాన్ని పఠించలేని దుర్భాషితులని, కలలో కూడా శ్రీకాంతుణ్ణి గుర్తు ఎరగలేని వాళ్ళనీ, కృష్ణ కర్ణామృతం చెవికెక్కని వాళ్లనీ, ఉత్సవ దినాలలో కూడా గుడికి వెళ్ళని చెడునడత గలవారినీ (దుష్టదులు), పాపులని ముందు ఇక్కడకి తీసుకురండి.

ఆ. ఎల్ల పాపములకు నిల్లైన యింటిలో
బద్ధతృష్ణు లగుచు బుద్ధి దలఁగి
పరమహంసకులము గుఱిదప్పి వర్తించు
ధూర్తజనులఁ దెండు దూతలార! [6-189]

అనేక పాపాలకి నిలువైన ఇళ్ళలో కోరికలకి తగులుకుంటూ (బద్ధ తృష్ణులగుచు), పరమహంసల (మహాత్ముల) దారిని అనుసరించకుండా పోయేవారిని ఇక్కడకి తీసుకురండి.

ఆ. పద్మనయను మీఁది భక్తి యోగం బెల్ల
ముక్తి యోగ మనుచు మొద లెఱుంగు
వారి వారివారి వారిఁ జేరినవారి
ద్రోవఁ బోవ వలదు దూతలార! [6-191]

అంతే కానీ విష్ణువు మీద భక్తి (పద్మనయనుని) ఒకటే ముక్తికి దారి అని తెలిసిన వాళ్ల దగ్గిరకి కూడా వెళ్లకండి. ఈ పద్యంలో రెండు మూడు పాదాల్లో పదాలు గమనించారా? మొద లెఱుంగు వారి, వారివారి వారిఁ జేరినవారి. ముక్తియోగం అని తెలిసినవారినీ (ముక్తి యోగ మనుచు మొద లెఱుంగు వారి), వారివారి (వారి యొక్కవారి, అంటే వాళ్ల వాళ్లనీ), వారి జేరినవారి (అలా ముక్తియోగం గురించి తెలిసినవారిని అనుసరించే వారినీ కూడా) తీసుకురావద్దు.

వ. అని పలికె" నని చెప్పి మఱియు శుకుం డిట్లనియె "శ్రీకృష్ణనామ కీర్తనంబు జగన్మంగళం బనియును, జగన్మోహనం బనియును, జగజ్జేగీయమానం బనియును, నిఖిలపాపైక నిష్కృతి యనియును, నిఖిల దుఃఖ నివారణం బనియును, నిఖిలదారిద్ర్య నిర్మూలనం బనియును, నిఖిల మాయా గుణవిచ్ఛేదకం బనియును, నుద్దామంబు లగు హరి వీర్యంబుల నాకర్ణించు వారల చిత్తంబు లతి నిర్మలంబులగు భంగిం దక్కిన వ్రతాచరణంబులం గావనియును, శ్రీకృష్ణ పదపద్మంబులు హృత్పద్మంబుల నిలుపు వార లన్య పాపకర్మంబు లగు నవిద్యా వ్యసనంబులం బొరయ నేరరనియును, నిజస్వామియైన యమధర్మ రాజుచేతఁ గీర్తింపంబడిన భగవన్మహత్త్వంబు నాకర్ణించి, విస్మితులై కాలకింకరులు నాఁటనుండియు వైష్ణవజనంబులం దేఱిచూడ వెఱతురు; నరేంద్రా! పరమగుహ్యంబగు నీ యితిహాసంబును బూర్వకాలంబున సకల విజ్ఞానగోచరుండైన కుంభసంభవుండు సకలదుఃఖ విలయంబును సకలపుణ్య నిలయంబును నైన మలయంబునఁ బురాణపురుషుండైన పురుషోత్తము నారాధనంబు చేయుచుండి నాకెఱింగించెను;" అని చెప్పిన విని విస్మయానంద హృదయుండై పరీక్షిజ్జనపాలుం డిట్లనియె. [6-192]

అందువల్ల శ్రీకృష్ణ నామం ఎంతటి గొప్పదంటే, అది జగన్మంగళం, అన్నిపాపాలకీ నిష్కృతి కలిగించేది, దుఃఖాలని పోగొట్టేది, ఎంతటి మాయనైనా సరే ఛేధించగలిగేది. అలా భగవంతుడి నామం గుర్తుంచుకునేవారికి మనసు నిర్మలమవడం వల్ల కాలకింకరులు వాళ్ళకేసి చూడలేరు. ఇది విజ్ఞాన గోచరుండైన కుంభసంభవుడు (కుంభము, కుండ లో పుట్టినవాడు, అగస్త్యుడు, విజ్ఞాన గోచరుండు – ఆత్మసాక్షాత్కారం పొందిన వాడు) మలయపర్వతం సమీపంలో నారాయణుణ్ణి ఆరాధన చేస్తున్నప్పుడు నాకు (శుకమహర్షికి) చెప్పాడు. అది నీకు చెప్పాను అని ముగిస్తున్నాడు మహర్షి. ఇంతలా ఎందుకు అని మరో సారి ఆలోచిద్దాం.

ఒక్క వారం రోజుల్లో చావబోయే పరీక్షిత్తు ఇంతకు ముందు ఏమేం పాపాలు చేసాడో అవన్నీ ఇప్పుడు అనవసరం. అహం పాపాత్మా అనేదే మొదటి దరిద్రం కదా. అది వదిలించుకోవాలి ముందు. "అహం బ్రహ్మాస్మి, తత్వమసి అని కదా పంచమహావాక్యాలు చెప్పేది? ఏమీ పుణ్యం చేయకపోయినా పోయేటపుడు ఒక్క పదం 'నారాయణ' అనడం తోటే అజామీళుడు వైకుంఠం చేరాడు. అందువల్ల ఇంకా నీకు మిగిలిన ఈ వారం రోజుల్లో నారాయణ అనే నామం ఉచ్ఛరించడానికి సమయం ఉంది. అదే అభ్యాసం చేస్తూ ఉండు. అన్ని దరిద్రాలకీ భగవన్నామమే దారి, ధైర్యంగా ఉండు" అని చెప్తున్నాడన్నమాట. ఇదే మనకి కూడా వర్తిస్తుంది. ఎవరు ఎప్పుడు పోతారో ఏ స్థితిలో పోతారో ఎవరూ చెప్పలేరు కనక నిరంతరం భగవన్నామం మనసులో ఉంచుకుంటే మంచిదని ఈ కథ. అయితే ఏ రూపంలో భగవంతుడు గుర్తున్నాడనేది అనవసరం. నారాయణీయం రాసిన భట్టాత్తిరి గారు అనడం ప్రకారం పౌండ్రక వాసుదేవుడు, కృష్ణుడిలాగే శంఖ చక్రాలు తయారు చేయించి వేసుకుని "నేనే అసలు వాసుదేవుణ్ణి, నువ్వెడవి, ఇంకో వాసుదేవుడివా, అలా అయితే నాతో యుద్ధానికి వచ్చి నీ ప్రతాపం చూపించు" అన్నాట్ట కృష్ణుడితో.

భట్టాత్తిరి గారు అనడం ఏమిటంటే,
జాడ్యేన బాలకగిరాపి కిలాహమేవ,
శ్రీవాసుదేవ ఇతిరూఢమతి శ్చిరం సః
సాయుజ్యమేవ భవదైక్యధియాగతోభూత్,
కోనామ కస్యసుకృతం కథమిత్యవేయాత్ (నారాయణీయం 83.5)

జాడ్యం చేత (బుద్ధి లేక) అయితేనేం, మరొక కారణం అయితేనేం, వింతల్లో వింతగా పౌండ్రకవాసుదేవుడు కృత్రిమంగా నీలాంటి వేషం వేసుకుని, గర్వంతో ఎగిసిపడుతూ, నీ చేతుల్లో సంహరించబడి నీ సారూప్యభావన వలనే సాయుజ్యం పొందాడు కదా. స్వామీ లోకంలో ఏ జీవి ఏ పుణ్యం చేసుకుందో చెప్పడం ఎవరితరం?

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS